హైదరాబాద్ వార్త



# దోమలు వదిలేసి..డీజిల్ మింగేసి

-జిహెచ్ఎంసి యాంటమాలజీలో ఆగని అవినీతి
-ఫాగింగ్ చేయకుండానే డీజిల్,పెట్రోల్ మాయం
-పెట్రోల్ బంకులతో సిబ్బంది కుమ్మక్కు..
-ఇంధనానికి బదులు నగదు వసూళ్లు




**హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:** నగర ప్రజలను దోమలు పట్టిపీడిస్తుంటే, వాటి నివారణకు కేటాయించిన కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగంలోని కొందరు అవినీతి అధికారులు దోచుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఫాగింగ్ చేయకుండానే చేసినట్లు రికార్డులు సృష్టిస్తూ, డీజిల్, పెట్రోల్, మరమ్మతుల పేరుతో భారీగా బిల్లులు మాయం చేస్తున్నారు. ఈ అవినీతి బాగోతంపై ఏకంగా ఎంటమాలజీ సిబ్బందే ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో, బల్దియా విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగి విచారణ ప్రారంభించింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పక్కాగా ఫాగింగ్ చేయాలన్న కమిషనర్ ఆదేశాలు గాలికొదిలేశారు. దీనిపై మల్కాజ్‌గిరి సర్కిల్‌కు చెందిన ఎంటమాలజీ వర్కర్లు ఇటీవల లెక్కలతో సహా ఫిర్యాదు చేశారు. తమ సర్కిల్‌లో రోజూ ఫాగింగ్ పేరుతో 120 లీటర్ల డీజిల్, 8 లీటర్ల పెట్రోల్‌ను అధికారులు కాజేస్తున్నారని, దీని ద్వారా ప్రతిరోజూ సుమారు రూ. 13,000 పక్కదారి పట్టిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించి, లోతుగా ఆరా తీస్తున్నారు. విచారణలో భాగంగా, బక్రీద్ సెలవు దినమైన జులై 7న కూడా సిబ్బంది హాజరైనట్లు అటెండెన్స్ వేసి, ఆ రోజుకు సంబంధించిన డీజిల్, పెట్రోల్‌ను కూడా డ్రా చేసినట్లు గుర్తించినట్లు సమాచారం. ఈదందా కేవలం ఒక్క సర్కిల్‌కే పరిమితం కాలేదు. గ్రేటర్‌లోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**ఏళ్లుగా ఒకేచోట..**

ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన పలువురు సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు ఏఈఈ అక్రమాలకు కేంద్ర బిందువులుగా మారారు. మరోవైపు, కీలకమైన శేరిలింగంపల్లి జోన్‌లో సీనియర్ ఎంటమాలజిస్ట్ లేకపోవడంతో, వర్కర్లు ఫీల్డ్‌కు రాగానే అటెండెన్స్ వేసి ఇళ్లకు పంపించేస్తున్నారని, ఫాగింగ్ పూర్తిగా అటకెక్కిందని తెలుస్తోంది. గ్రేటర్‌లోని 30 సర్కిళ్లకు గాను ఉన్న 300 చిన్న, 63 పెద్ద ఫాగింగ్ యంత్రాలలో, దాదాపు 50 యంత్రాలు ఎప్పుడూ మరమ్మతుల్లోనే ఉంటున్నాయి. అయితే, అధికారులు ఈ పాడైన యంత్రాల పేరుతో కూడా ఇంధనాన్ని డ్రా చేయడమే కాకుండా, వాటికి మరమ్మతులు చేయకుండానే చేసినట్లు బోగస్ బిల్లులు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నిధులను ఎంటమాలజీ ఎస్ఈలు, సూపర్‌వైజర్లు కుమ్మక్కై పంచుకుంటున్నారని, డీజిల్‌ను బయట అమ్ముకుంటున్నారని సొంత సిబ్బందే ఆరోపిస్తున్నారు.

**ఎన్నిమార్పులు చేసినా ఆగని అవినీతి..**

డీజిల్ దందాకు చెక్ పెట్టేందుకు కమిషనర్ ఆర్వీ కర్ణన్ కూపన్లకు బదులుగా ఏటీఎం తరహా కార్డు విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఖైరతాబాద్ జోన్‌లో అమలులోకి తెచ్చారు. అయితే, అవినీతి అధికారులు ఇక్కడా తమ జిమిక్కు చూపిస్తున్నారు. పెట్రోల్ బంకులతో కుమ్మక్కై, ఇంధనానికి బదులుగా నగదు తీసుకుంటూ బిల్లులు పెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ ఏటా దోమల నివారణకు రూ.30 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా, ఆ నిధులు క్షేత్రస్థాయికి చేరకుండా పక్కదారి పడుతున్నాయి. దీంతో నగరవాసులు డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నారు.

# దంచికొట్టిన వాన

-లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం -రోడ్లపై ట్రాఫిక్ జామ్..వాహనదారులకు తిప్పలు





**హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:** నగరంలో గురువారం వర్షం దంచి కొట్టింది. జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, హైటెక్ సిటీ, కొండాపూర్, లింగంపల్లి, కూకట్ పల్లి, ఎర్రగడ్డ, సనత్ నగర్, అమీర్ పేటర్,పంజాగుట్ట, ఖైరతాబాద్, సికింద్రాబాద్, మొహదీపట్నం అల్వాల్, బోయిన్ పల్లి, బాలానగర్ వంటి ప్రాంతాల్లో భారీగా కురిసింది..దీంతో లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై నీరు చేరింది. ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే సమయం కావడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లోని సుచిత్ర, కొంపల్లి, గండిమైసమ్మ, దుండిగల్, మల్లంపేట్, బౌరంపేట్, బహదూర్ పల్లి, సూరారం, చింతల్, జీడిమెట్ల, షాపూర్ నగర్, గాజులరామారంలో రాత్రి వరకు కురిసింది. ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ ప్రాంతాలలో ఉన్నట్లుండి ఊపందుకుంది. అదే విధంగా తార్నాక, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ ఏరియాల్లో కూడా వర్షం కురిసింది. సికింద్రాబాద్, పరేడ్ గ్రౌండ్స్ ఏరియాల్లో వర్షం కురుస్తుండటంతో ట్రాఫిక్ జాం అయ్యింది.

# నిమజ్జనానికి జిహెచ్ఎంసి పకడ్బందీ ఏర్పాట్లు

-134 స్టాటిక్ క్రేన్లు, 269 మొబైల్ క్రేన్లు సిద్ధం
-మూడు షిఫ్ట్ లలో 14,486 మంది విధులు
-రోడ్లపై 10,269 పైగా గుంతల పూడ్చివేత
-చెరువుల వద్ద డిఆర్ఎఫ్, ఈతగాళ్లతో పహారా




**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** గణేశ్ నిమజ్జనాన్ని సజావుగా,సురక్షితంగా నిర్వహించేందుకు వీలుగా జీహెచ్ఎంసీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, రెవెన్యూ, విద్యుత్, ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేస్తూ, నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా జరిగేలా పకడ్బందీ కార్యాచరణను సిద్ధం చేసింది. గణేష్ నిమజ్జనం ఆధ్యాత్మిక వాతావరణంలో సాఫీగా జరిగేలా కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పర్యవేక్షణ చేస్తున్నారు.అలాగే ప్రధాన చెరువులతో పాటు 74 కృత్రిమ కుంటలలో నిమజ్జనంజరిగేలా జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. తద్వారా ప్రధాన చెరువుల పై ఒత్తిడి తగ్గనుంది. అలాగే డీఆర్ఎఫ్ బృందాలు,ఈతగాళ్లతో పహరా ఉండనున్నారు.నిమజ్జనం వేగంగా, సురక్షితంగా, సాఫీగా జరిగేలా 134 స్టాటిక్ క్రేన్లు, 269 మొబైల్ క్రేన్లు సిద్ధం చేశారు. పర్యాటక శాఖ,హైడ్రా సమన్వయంతో హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యేకంగా 9 పడవలు, 16 డీఆర్ఎఫ్ బృందాలు, 200 ఈతగాళ్లను జీహెచ్ఎంసీ అందుబాటులో ఉంచుతుంది. 839. 42 కి.మీ. ఊరేగింపు మార్గాల్లో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, వేలాడే వైర్ల తొలగింపు పనులు పూర్తయ్యాయి.అలాగే14,486 శానిటేషన్ సిబ్బంది, 160 గణేశ్ యాక్షన్ టీమ్‌లు మూడు షిఫ్ట్ లలో నిరంతరాయంగా విధులు నిర్వర్తిస్తారు.గణేష్ మండపాల వద్ద వ్యర్థాల సేకరణకు 5 లక్షల ట్రాష్ బ్యాగులు పంపిణీ చేశారు. అదనంగా 2,000 స్వీపర్లు, 102 మినీ టిప్పర్లు, 125 జేసీబీలు, 30 స్వీపింగ్ మెషిన్లు నిమజ్జన దినాన చెత్త తొలగింపులో పాల్గొంటాయి.అలాగేప్రజల కోసం 309 మొబైల్ టాయిలెట్స్, 56,187 లైటింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆరోగ్య భద్రత కోసం 7 మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ లతో మూడు షిఫ్ట్‌లలో పని చేస్తున్నారు.అలాగే దోమల నివారణకు ఆంటిలార్వా, ఫాగింగ్ చేపట్టారు. భక్తులు ప్రమాదాల బారిన పడకుండా చూసేందుకు వీధి కుక్కలను పట్టుకొనే వాహనాలను మండపాలు, నిమజ్జన పాయింట్‌లలో సిద్ధంగా అందుబాటులో ఉంచుతున్నారు.అలాగే రోడ్డు సేఫ్టీ డ్రైవ్ లో భాగంగా ఊరేగింపు జరిగే మార్గాల తో పాటు నగరంలో 10,269 గుంతలను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం పూడ్చివేసింది. రోడ్డు మరమ్మతులు కూడా పూర్తి చేసింది.

గత సంవత్సరం మాదిరే ఈ సంవత్సరం కూడా గణేశ్ నిమజ్జనం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ స్పష్టం చేశారు.

# ఉధృతంగా పారుతున్న మూసీ నది

- మూసీలో మునిగిన నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్
- నిలిచిపోయిన నార్సింగి-మంచిరేవుల రాకపోకలు



నార్సింగి వద్ద ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ రోడ్డుపై ఉధృతంగా పారుతున్న మూసీ నది దృశ్యం



మంచిరేవుల వద్ద బ్రిడ్జి పైనుంచి పారుతున్న మూసీ నది.

**నార్సింగి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్ సాగర్‌లు నిండు కుండలుగా మారాయి. దీంతో జల మండలి అధికారులు ఈ రెండు జలాశయాల నుంచి నీటిని ఈసీ, మూసీ నదుల్లోకి వదిలిపెట్టారు. గండిపేట జలాశయం వద్ద 8.గేట్లను 3.ఫీట్ల మేర ఎత్తి మూసీ నదిలో కి 2,700. క్యూసెక్కుల నీటిని వదిలేశారు. అలాగే హిమాయత్ సాగర్ జలాశయం వద్ద 2.గేట్లను 3.ఫీట్లు, 1.గేటును 1.ఫీటు మేర ఎత్తి ఈసీ నదిలోకి 2,300.క్యూసెక్కుల నీటిని వదలిపెట్టారు. దీంతో ఈసీ నది లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద మూసీలో కలిసి మరింత ఉధృతంగా పారుతుంది. గండిపేట జలాశయం నుంచి వస్తున్న వరద నీరు నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఎగ్జిట్‌ను పూర్తిగా ముంచెత్తింది. దీంతో అధికారులు ఇక్కడ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అలాగే నార్సింగి-మంచిరేవుల మధ్య ఉన్న బ్రిడ్జి పైనుంచి నీరు వెళ్తుండడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక్కడికి ప్రజలు ఎవ్వరూ రాకుండా పోలీసులు పికెట్‌ను ఏర్పాటు చేసుకొని బందోబస్తును నిర్వహిస్తున్నారు.

ఎప్పటికప్పుడు జలమండలి, గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిలు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది : మంత్రి వివేక్ వెంకటస్వామి




హెచ్ఎఫ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లిం గ్రేవ్ యార్డ్‌కు స్థలం కేటాయించాలంటూ ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేస్తున్న మైనారిటీ నాయకులు.

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 29, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజా సంక్షేమం కోసం అన్నివేలల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరుగుతుందని నియోజకవర్గం ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్ నగర్ డివిజన్ హెచ్ఎఫ్‌నగర్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో నూతనంగా మైనారిటీల కోసం స్మశాన వాటిక ఏర్పాటు కోసం సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు చెందిన మజీద్ కమిటీలు స్మశాన వాటికల కమిటీలు శుక్రవారం నమాజ్ తర్వాత పెద్ద ఎత్తున సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతం జనాభ పెరగటంతో మైనార్టీలకు స్మశాన వాటిక స్థలం సరిపోవటం లేదని కొత్త స్థలం కేటాయించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. అందుకు ఆయన వవెంటనే స్పందించి నియోజకవర్గంలో ఉప ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే సమస్యను పరిష్కరిస్తామని ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జిల్లా కలెక్టర్‌తో చర్చించడం జరిగిందని తొందర్లో స్థలాన్ని పరిశీలించి కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మైనారిటీ నాయకులు హర్షంవ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మైనారిటీల మద్దతు ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే హాజారుద్దీన్, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బాలరెడ్డి రామ్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, నిజాముద్దీన్, భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు అమలు




రూట్ మ్యాప్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** నగరంలో గణేష్ ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. చవితి ప్రారంభమైన మూడవ రోజు నుంచి వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్‌డెవిస్ వెల్లడించారు. ఈ ట్రాఫిక్ ఆంక్షలు సెప్టెంబర్ 5వ తేదీ వరకు కొనసాగుతాయని.. రద్దీని బట్టి ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, పీవీఎన్ఆర్ మార్గ్ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలు..**

కర్బలా మైదాన్ నుంచి వచ్చే ట్రాఫిక్ అప్పర్ ట్యాంక్ బండ్ వైపు అనుమతించరు. లిబర్టీ, ఖైరతాబాద్ వైపు వెళ్లాలనుకునేవారు కవాడిగూడ క్రాస్‌రోడ్డు, డీబీఆర్ మిల్స్, వార్త లేన్, బండమైసమ్మ, ధర్నాచౌక్, ఇందిరాపార్క్ ఎక్స్ రోడ్, రామకృష్ణ మఠం, కట్టమైసమ్మ జంక్షన్, అంబేద్కర్ విగ్రహం, తెలుగుతల్లి ఫ్లైఓవర్, ఇక్బాల్ మినార్ వైపు వెళ్లవచ్చు. ట్యాంక్‌బండ్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లాలనుకునేవారు రాణిగంజ్, మినిస్టర్ రోడ్, బేగంపేట్‌ల నుంచి వెళ్లవచ్చు. పంజాగుట్ట, రాజ్‌భవన్ నుంచి ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు వైపు వెళ్లే సాధారణ ట్రాఫిక్‌ను నిరంకారి, పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్, ఇక్బాల్ మినార్ వైపు మళ్లిస్తారు. అంబేద్కర్ విగ్రహం నుంచి వచ్చే ట్రాఫిక్ ఎన్టీఆర్ మార్గ్ వైపు అనుమతించరు. ఇక్బాల్ మినార్ వైపు వెళ్లాలి. ఇక్బాల్ మినార్ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను ట్యాంక్‌బండ్ వైపు అనుమతించరు.

**తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు మళ్లిస్తారు.**

బుద్ధభవన్ నుంచి వచ్చే సాధారణ ట్రాఫిక్‌ను నెక్లెస్ రోడ్డు వైపు అనుమతిం చరు. అత్యవసర నిమిత్తం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626కి కాల్ చేయాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే వాహనదారులు సైతం పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్‌డెవిస్ పేర్కొన్నారు.

## గణేష్ నిమజ్జనం సందర్భంగా గట్టి బందోబస్తు

: నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్

**చార్మినార్,ఆగష్టు 29 ప్రభాతవార్త :** పాతబస్తీ పురానీహవేలిలో శుక్రవారం డిజీ, నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ అధ్యక్షతన దక్షిణ మండలం పోలీస్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీ గణేష్ నిమజ్జనం సందర్భంగా తీసు కోవలసిన భద్రతా చర్యలు,బందోబస్తుపై పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ పోలీస్ అధికారులతో కలిసి చర్చించారు.ఈ సందర్భంగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ శ్రీ గణేష్ నిమజ్జనం,మిలాద్ ఉన్ నబీ పండుగ కూడ ఉన్నందున శాంతి భద్రతల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించామని తెలిపారు.గణేష్ విగ్రహాలను నిమజ్జనం రోజున త్వరగా తరలించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై చర్చించామని,అధికారులకు తగిన సూచనలు ఇవ్వడం జరిగిందని ఆయన ఆయన తెలియజేశారు.ఈ సమా వేశంలో సౌత్ జోన్ డిసిపి స్నేహా మెహ్రా,డిసిపి ఎస్‌బి అపూర్వరావు,ట్రాఫిక్ డిసిపి వెంకటేశ్వర్లుతో పాటు పాతబస్తీలోని మీర్‌చౌక్, చార్మినార్,ఫలక్‌నుమా ఏసిపిలు,సిఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.

## డిఫెన్స్ భూముల నివేదిక వారంలో అందించాలి

-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:** జిల్లాలో గుర్తించిన డిఫెన్స్ లాండ్స్ కు సంబందించిన నివేదికలను వారంలోఅందించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్వాన్ శాసనసభ్యులు కౌసర్ మోహినుద్దీన్, నాంపల్లి శాసనసభ్యులు మాజీద్ హుస్సేన్, ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ లతో కలసి హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఆసిఫ్ నగర్, గోల్కొండ, నాంపల్లి అలాగే షేక్ పేట్ లో గుర్తించిన డిఫెన్స్ భూములపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఫెన్స్ భూములలో నిరుపేదలు నివాసముంటున్నందున ప్రభుత్వం 2022 సంవత్సరంలో ఉత్తర్వులకు మేరకు వివిధ మండలాల్లో నాలుగు ప్రాంతాల్లోని ఐదు ప్రదేశాలకు సంబందించిన నివేదికలను వారంలో అందించాలని కలెక్టర్ సూచించారు. అలాగే సంబంధిత భూములపై డిఫెన్స్ అధికారులతో చర్చించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అదేవిధంగా ఇప్పటికే అన్ని ప్రదేశాల నుండి దరఖాస్తులు అందాయని అన్నారు. అట్టి డిఫెన్స్ భూములపై వారంలో నివేదిక అందిన పిదప ల్యాండ్ వాల్యుయేషన్ వేయడం జరుగుతుందని అన్నారు. అదేవిదంగా తదుపరి చర్యలకై ప్రభుత్వానికి నివేదిక సమర్పించబడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, పర్యవేక్షకులు ప్రవీణ్ కుమార్, సంబంధిత తాసిల్దార్లు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ల పదవీవిరమణ వయసు 65కు పెంచొద్దు

-ఏజీ వర్సిటీ విద్యార్థుల ఆందోళన



**అత్తాపూర్ ఆగస్టు29,ప్రభాతవార్త :** 65 వద్దు...60 ముద్దు ,పాలిటిక్స్ వద్దు పాఠశాలు ముద్దు,రీసెర్చ్ మీద దృష్టి పెట్టు..నూతన వంగడాలను కనిపెట్టు విద్యార్థులకు వ్యవసాయ విద్యను అందించురైతులకు వ్యవసాయ విస్తరణ సేవలు అందించుఅంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ వ్యవసాయ వర్సిటీలోనీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును ఎట్టి పరిస్థితిలో పెంచొద్దంటూ విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో గల జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... వర్సిటీలో మాకు పాఠాలు చెప్పాల్సిన ప్రొఫెసర్లు పాలిటిక్స్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించడం హాస్యాస్పదమన్నారు. కొంతమంది ప్రొఫెసర్లు టాసా అనే పేరు మీద ప్రతిరోజు యూనివర్సిటీ అధికారులను కలుస్తూ వర్సిటీ పరిపాలన సక్రమంగా జరగకుండా అడ్డుపడడం బాధాకరణమన్నారు.ప్రొఫెసర్లు తమ పర్సనల్ ఎజెండా కోసం వర్సిటీ అధికారులపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీలలో పనిచేసే ప్రొఫెసర్ల పదవి విరమణ 60 నిండి 65లకు పెంపు అనేది కేవలం ట్రెడిషనల్ యూనివర్సిటీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేస్తూ జీవో విడుదల చేసిందని అందులోనే టెక్నికల్ వర్సిటీలైనా అగ్రికల్చరల్, హార్టికల్చర్ వెటర్నరీ యూనివర్సిటి లకు వర్తించదనీ స్పష్టం చేసిన కూడా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఇటు వర్సిటీని అటూ ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ దొడ్డిదారిలో పదవి విరమణ వయసు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు వర్సిటీ వీసీ జానయ్య రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం చేపట్టగా ఆది సక్సెస్ కావడంలో వర్సిటీ శాస్త్రవేత్తలతో పాటు విద్యార్థుల పాత్ర కూడా ఉందని మమ్మల్ని అభినందిస్తూ మా సేవలను గుర్తిస్తూ గత 14 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న స్టైఫండ్‌ను పెంచుతూ వర్సిటీ తీసుకున్న నిర్ణయం ప్రొఫెసర్లకు నచ్చకపోవడం చాలా బాధాకరమన్నారు.ఇప్పటికైనా టాసా అనే పేరు మీద వర్సిటీలో రాజకీయాలు చేస్తే వారికి తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందంటూ విద్యార్థులు హెచ్చరించారు. పదవి విరమణ వయసు పెంపు విషయంలో వారి పంతాను మార్చుకోని పక్షంలో అగ్రికల్చరల్, హార్టికల్చర్ వెటర్నరీ మూడు వర్సిటీల విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడానికి సిద్ధమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాజ్ కుమార్, కవి రాజు, శంకర్ నాయక్, లోకేష్, శ్రావణి ,నవ్య, ప్రసాద్, మునీర్, భాను తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు సంప్రదాయాలకు ప్రతి రూపాలు



గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న న్యూ నోబెల్ డిగ్రీ, పీజీ కళాశాల ఇంచార్జ్ గౌని చంద్రయ్య, ప్రిన్సిపాల్ ప్రేమలత తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 29, ప్రభాతవార్త:** పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతి రూపాలని న్యూ నోబుల్ డిగ్రీ, పీజీ కళాశాల ఇంచార్జ్ గౌని చంద్రయ్య, ప్రిన్సిపాల్ ప్రేమలత లు పేర్కన్నారు. ముసారంబాగ్ లోని న్యూ నోబుల్ డిగ్రీ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి వారు విద్యార్థుల తో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను కళాశాలలో నిర్వహించడంతో విద్యార్థులకు పండుగలు వాటి విశిష్టత, ప్రాధాన్యత గురించి అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు అన్ని అంశాల గురించి వివరిస్తున్నామని తెలియజేశారు. గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని ప్రతిరోజు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

## చెట్ల కొమ్మలు తొలగింపు



**మల్కాజిగిరి ఆగస్టు29,ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బిజెఆర్ నగర్‌లో వినాయక మండపాలను ఏర్పాటు చేసిన ఏరియాలలో రోడ్డు మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయని తద్వారా తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయి రోడ్డు గుంతలు ఉన్నాయని ప్యాచ్ వర్క్ చేయించాలని స్థానికులు కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ దృష్టికి తీసుకురావడంతో హార్టికల్చర్ మేనేజర్ మహేశ్వరి, వెంకటేష్, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్ ఎలక్ట్రికల్ లైన్ మెన్ బాబు తో పరిశీలించి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ కార్యక్రమంలో బాబు సత్యనారాయణ సంపత్ రావు, ఆంటోనీ, హర్ష, మింటు, ఉమామహేశ్వర రావు, వీరయ్య గౌడ్, పాల్గొన్నారు

## డిప్యూటీ కమిషనర్‌ని కలిసిన కార్పొరేటర్



**మల్కాజిగిరి ఆగస్టు29,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి డిప్యూటీ కమీషనర్ జకీయ సుల్తానాని కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. డివిజన్ లో జరగాల్సిన పనులని పరిశీలించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మంగేష్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు ఓం ప్రకాష్, జ్యోతిర్మయి, గోపాల్, సాయిసురేష్, ప్రవీణ్, పాల్గొన్నారు.

## లైఫ్ సైన్సెస్‌లో కెరీర్ అవకాశాలపై అవగాహన



**నేరెడ్ మెట్, ఆగస్టు 29.ప్రభాతవార్త**

భవన్స్ వివేకానంద కళాశాల ఆఫ్ సైన్స్, హ్యూమానిటీస్ అండ్ కామర్స్‌లోని జెనెటిక్స్ అండ్ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 28, 29 తేదీలలో "మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ" అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల మరియు వివిధ పాఠశాలల 10+2 విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను లైఫ్ సైన్సెస్‌లో ఉన్నత విద్య వైపు ప్రేరేపించడం, బయోటెక్నాలజీ రంగంలో ఉన్న కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించడం వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. హెచ్‌ఓడీ డాక్టర్ బి. కల్పనా మార్గదర్శకత్వంలో డాక్టర్ ఐ. రచనా కుమారి, డాక్టర్ ఎస్. నాగమాంజు ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లుగా వ్యవహరించగా, జెనెటిక్స్ బయోటెక్నాలజీ విభాగ అధ్యాపకులు, బీ.ఎస్సీ విద్యార్థులు రిసోర్స్ పర్సన్స్‌గా ఉన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైన్స్ ల్యాబ్‌లో ప్రత్యక్ష ప్రయోగాలను అనుభవించారు.

## ఏకదంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలి :బ్రహ్మశ్రీ బంగారయ్యశర్మ



పూజలో పాల్గొన్న బంగారయ్యశర్మ, కమిటీ సభ్యులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘము ఆధ్వర్యంలో మహా గణపతి 38వ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా రెండవ రోజు నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా శ్రీభారతీ తీర్థపురస్కార గ్రహీత, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త, సనాతన ధర్మోద్ధారక, ఆర్షవిద్యాతపస్వి, అర్ధవిజ్ఞాన భాస్కర, తత్వ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్త, కాలనీ ప్రధానకార్యదర్శి అయిత అంజయ్య, అష్టలక్ష్మీ దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ మాద్యం సుధాకర్‌గుప్తా, అష్టలక్ష్మీ దేవాలయ మాజీ చైర్మన్ బంధం దామోదర్‌గుప్తా, ఉత్సవ కమిటీ కన్వీనర్ బచ్చు ప్రభాకర్, కోకన్వీనర్ వెంపటి కృష్ణమోహన్, చిలుక ఉపేందర్‌రెడ్డి, గౌరిశెట్టి శ్రీనివాస్, అరుణ్‌కుమార్, వనమా సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే అనిల్, తమన్నా శ్రీధర్, భరద్వాజ్, దండు రాజు, వినోద్, గౌరీ శంకర్, సత్యనారాయణ, మాలే శ్రీనివాస్, శుభకర్, కృష్ణమూర్తి, రామస్వామి, మేఘమాల, భ్రమరాంబ, గోలి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ పారిశ్రామికవాడలో వెయ్యి గజాల ప్రభుత్వ స్థలం కబ్జా

### -మొద్దు నిద్రలో ఐలా అధికారులు
### -పట్టించుకోని పాలకులు



ఉప్పల్ సర్వేనెం.1లో పారిశ్రామికవాడ స్థలంలో వివాదంలో ఉన్న స్థలంలో ఇరువర్గాల గొడవ పడుతున్న దృశ్యం.

**ఉప్పల్, ఆగస్టు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ పారిశ్రామికవాడలో ప్రభుత్వ స్థలాలు కనుమరుగు అవుతున్నాయి. పారిశ్రామికవాడలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు సరియైన హద్దులు లేకపోవడంతో కొందరు బినామీ పేర్లతో కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో ఉప్పల్ వెలుగు గుట్ట సమీపంలోని సర్వేనెం.1లోని సుమారు వెయ్యి గజాల స్థలంలో కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా హోటల్ నిర్మాణం చేపట్టారు. అయితే ఈ స్థలం ఐడిఏ అధికారులు తమకు కేటాయించారని నిర్మాణదారులు చెబుతుండగా, నిజాం కాలం నుంచి తమకు హక్కులు ఉన్నాయని మరో వర్గం వారు పేర్కొంటున్నారు. ఇదే క్రమంలో సర్వేనెం.1లోని వెయ్యి గజాల స్థలంలో వేసిన షెడ్డు తొలగించాలని కొందరు పేర్కొంటుండగా, స్థలం తమదే మరో వర్గం వారు పేర్కొంటున్నారు. కాగా ఉప్పల్ సర్వేనెం.1లో గతంలో తహసీల్దార్‌గా పని చేసిన ఒక అధికారి ఇందులో వ్యవసాయం చేస్తున్నారని సర్టిఫికేట్ ఇచ్చి వివాదంలో పడ్డారు. అప్పట్లో అయనను అధికారులు సస్పెండ్ చేశారు. ఇదే స్థలం సమీపంలోనే తిరిగి సర్వేనెం.1లో నిర్మాణాలు జరుగుతున్నా ఐలా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కాగా ఉప్పల్ పారిశ్రామికవాడలోని విలువైన స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**మొద్దు నిద్రలో ఐలా అధికారులు :**

ఉప్పల్ పారిశ్రామికవాడలో ఐలా అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పారిశ్రామికవాడలో కంపెనీలకు కేటాయించిన స్థలంలో కొందరు అక్రమించి లారీల అడ్డాలు ఏర్పాటు చేశారు. ఉప్పల్ క్రికెట్ స్టేడియం సమపంలో వివాదంలో ఉన్న భూమిలో కొందరు హద్దులు ఏర్పాటు చేసుకుని ఇటీవల ప్రహరిగోడ ఏర్పాటు చేశారు. ఉప్పల్ జెర్సీ డైరీ సమీపంలో ఐలా స్థలంలో భారీ ఎత్తున పార్కింగ్ దందా సాగుతోంది. పలు చోట్ల రహదారి వెంట దుకాణాలు ఏర్పాటు చేసి అధికారులు లక్షలు దండుకుంటున్నానే ఫిర్యాదులు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలి: పోల్కం శ్రీనివాస్



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన పోల్కం శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట,ఆగస్టు 29, ప్రభాతవార్త:** పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ జలమండలి కాంట్రాక్టర్ అసోసియేషన్ జేఏసీ, మీడియా ఇన్చార్జ్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు . పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 8.30 కోట్ల రూపాయల పాత బకాయిలను తక్షణమే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్ల బిల్లులు విడుదల చేసినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో పనులు చేసిన పాత బకాయిలను స్టేట్ విజిలెన్స్ రిపోర్ట్ వచ్చిన తర్వాత ఇంకా కూడా విడుదల కాలేదని, చిన్నచిన్న బడుగు బలహీన వర్గాలకు చెందిన కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్స్ రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు కాంట్రాక్టర్లు వారి కుటుంబ సభ్యులు జలమండలి కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పాతా బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించక విఫలమైందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పాత బకాయిలను విడుదల కావడానికి కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని పోల్కం శ్రీనివాస్ వివరించారు.

## జాతి వికాసంలో తమదైన ముద్ర వేస్తున్న సరస్వతీ శిశు మందిరాలు

### -కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



బాలుర వసతి గృహాన్ని ప్రారంభించి ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** విలువలతో కూడిన విద్యను అందిస్తూ సరస్వతీ శిశు మందిరాలు జాతి వికాసంలో తమదైన ముద్రను వేస్తున్నాయమని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి కొనియాడారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లోనున్న సరస్వతి విద్యాపీఠానికి చెందిన విద్యా భారతి విజ్ఞాన కేంద్రంలో నూతనంగా నిర్మించిన బాలుర వసతి గృహ సముదాయ ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరస్వతి విద్యాపీఠాల ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగం సుధాకర్‌రెడ్డి, సరస్వతి శిశు మందిర్ క్షేత్ర సేవా ప్రముఖ్ విద్యాన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ తదితరులతో కలిసి బాలుర వసతి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న మిగతా పాఠశాలల భిన్నంగా శిశు మందిరాలు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాయని అన్నారు. శిశు మందిర్ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఏ స్థాయిలోనైనా ఏ సంస్థలోనైనా పని చేస్తున్నప్పటికీ సత్ప్రవర్తనతో జాతి ఐక్యత, జాగృతి ప్రధాన లక్ష్యాలుగా తమ నడవడికను కొనసాగిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు నాణ్యమైన వసతి, సదుపాయాలను అందించడం ద్వారా వారు మెరుగైన విద్యాభ్యాసం చేయగలుగుతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బసవ పాపయ్యగౌడ్, యెల్మేటి దేవేందర్‌రెడ్డి, తర్రె మల్లేష్ యాదవ్, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, నడికుడ యాదగిరి, గుర్రం మల్లారెడ్డి, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, గూడెపు ఇంద్రసేన, దడిగ శంకర్, రామోజీ శ్రీశైలంచారి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, రేసు నర్సింహారెడ్డి, కోడూరు సోమేశ్వర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలలో అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్రీనివాస్ గుప్తా

**ఎల్.బి.నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ వరసిద్ది వినాయక మందిరాన్ని దర్శించుకున్న ఉప్పల దంపతులుకొత్తపేట డివిజన్ గాయత్రిపురంకాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గణపతి, సాయిబాబా దేవాలయం సలహాదారుడు డాక్టర్ ఏఆర్.గుప్త ఆహ్వానం మేరకు టీపీసీసీ ప్రధానకార్యదర్శి అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, ఐవిఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వంట శాల కోసం సిమెంట్ ను అందజేశారు. సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రిపురం రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బాలరా జు, జితేందర్ రెడ్డి, నవీన్ కుమార్, సోమ అనంత రాములు కాలని వాసులు పాల్గొన్నారు

### హబ్సిగూడ ఒయు బస్తీలో కాంగ్రెస్ నేతలు పర్యటన



హబ్సిగూడ ఒయు క్యాంపు బస్తీలో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు కంది శ్రవణ్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 29 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ ఒయు బస్తీలో శుక్రవారం జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒయు క్యాంపు బస్తీ సమస్యలపై స్పందించి అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారని తెలిపారు. వర్షాలకు రోడ్లు అధ్వాన్నంగా మారిపోయాయని, త్వరలోనే పనులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ధర్మేంద్ర నాయక్, హబ్సిగూడ రామాలయం చైర్మన్ చింతలబాబు, సీనియర్ నాయకులు జావిద్, శంకర్, అస్లామ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

### బాలాపూర్ గణపయ్య సేవలో హీరో మంచు మనోజ్



బాలాపూర్ గణేషుడిని దర్శించుకున్న సినీ హీరో మంచు మనోజ్

**సరూర్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ప్రఖ్యాత బాలాపూర్ గణేషుడిని సినీ హీరో మంచు మనోజ్ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం విచ్చేసిన ఆయన స్వర్ణగిరి బాలాపూర్ వినాయక మండపాన్ని సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి మంచు మనోజ్‌ను శాలువాతో సన్మానించి మినీ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వంగేటి అశ్విన్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.


## బాలాపూర్ గణేషుని సేవలో తీగల కృష్ణారెడ్డి



బాలాపూర్ గణేషునికి పూజల అనంతరం తీగలను సన్మానించి లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్న వంగేటి లక్ష్మారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, లడ్డూ వేలం నిర్వహణలో ప్రసిద్ధి చెందిన బాలాపూర్ లంబోదరుడికి హైదరాబాద్ మాజీ మేయర్, మాజీ హుడా చైర్మన్, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం బాలాపూర్ గణేష్ మండపాన్ని సందర్శించిన ఆయనకు గ్రామానికి చెందిన వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టికెఆర్ స్వర్ణగిరి మండపంలో వినాయనికి పూజలు జరపగా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆయనను సన్మానించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

## డివిజన్‌లో చెత్త కుప్పలను తొలగించండి : లచ్చిరెడ్డి



శానిటేషన్, ట్రాన్స్పోర్ట్ అదనపు కమిషనర్‌తో కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. ఆగస్టు.29.ప్రభాతవార్త**

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శానిటేషన్ మరియు ట్రాన్స్పోర్ట్ అదనపు కమిషనర్ సి.యస్ రఘు ప్రసాద్‌ని వారి కార్యాలయంలో బి యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కలిశారు.. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయని పారిశుద్ధం పనులు సరిగ్గా చేయడం లేదని, పలుమార్లు చెప్పిన అధికారులు పట్టించుకోవడంలేదని కావున ఎక్కడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు చెత్త సేకరణ వాహనాలను ఏర్పాటు చేయించి కాలనీలు శుభ్రపరచాలని, చెత్త కుప్పలను తొలగించాలని కార్పొరేటర్ అదనపు కమిషనర్‌ని కోరారు.

## గణనాధుడికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పూజలు



**సైదాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడి మండపాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సందర్శించి గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, బిజెపి నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, వీరేందర్‌బాబుతో పాటు పెద్ద ఎత్తున స్థానిక బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

### నిత్య పూజలందుకుంటున్న దుర్గానగర్ గణనాధుడు



పూజలు నిర్వహిస్తున్న సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, సభ్యులు

**సైదాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ దుర్గానగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడు కాలనీ వాసుల నిత్య పూజలు అందుకుంటున్నాడు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగ జగన్నాథ్‌రెడ్డితో పాటు సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు గణనాధుడికి పూజలు నిర్వహించారు.

## నీటి సమస్య పరిష్కారానికి కృషి



బోరు పర్ల శంకుస్థాపన చేస్తున్న అరుణసురేందర్ యాదవ్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి నిధుల కేటాయింపు జరిగిందని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పేర్కొన్నారు. సహభావన టౌన్ షిప్ బ్లాక్?బిలో మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో బోరు నిర్మాణం పనులకు శుక్రవారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎంపీ నిధులతో బోరు పనులు చేపట్టామన్నారు. భవిష్యత్తులో స్థానికులకు నీటి సమస్య ఉండదన్నారు. కాలనీలో సమస్యను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ షిప్ అసోసియేషన్ ప్రతి నిధులు ఐతగోని నరేష్, మారగోని స్నైడర్, పవన్ రెడ్డి, అర్చన, చైతన్య, మహా జబీనా, వినోద్, ప్రకాష్, రామకృష్ణ, ఉప్పల నగేష్, యాదగిరి, సుజన్ రాథోడ్, కాజా మియా, నల్ల మునీందర్ పాల్గొన్నారు.

### చిలుకానగర్ కల్వర్టు పనులు పూర్తి : బన్నాల గీత



చిలుకానగర్ కల్వర్టు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 29 ప్రభాతవార్త :** చిలుకానగర్ నుంచి ఉప్పల్ ప్రధాన రహదారి వెళ్లే దారిలో చేపట్టిన బాక్స్ కల్వర్టు పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ రూ.17లక్షల వ్యయంతో చిలుకానగర్ నుంచి ఉప్పల్ ప్రధాన రహదారి బాక్స్ కల్వర్టు పనులను చేపట్టామని, బీరప్పగడ్డ పరిసర కాలనీలలో నుండి వచ్చే వర్షపు నీరు ఇరిగేషన్ నాలాలో వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమస్య శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని,సుమారు నెలరోజుల నుంచి ఈ కల్వర్టు పనులు జరుగుతున్నాయని, వర్షాల కారణంగా పనులు అలస్యం అయ్యాయని తెలిపారు. పది రోజుల్లో రహదారిని ప్రారంభిస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులను అనుమతిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, శ్రీనగర్ కాలనీ నేతలు పాల్గొన్నారు.

### చంపాపేటలో గణనాధుడికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:**

చంపాపేట రెడ్డి కాలనీలోని ప్రభుత్వ బాలుర వికలాంగుల సదనంలోని గణనాధుడికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజిరెడ్డి, శ్రీనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, సింగిరెడ్డి వేణుగోపాల్, కమిటి సభ్యులు కట్ట ప్రసాద్, మోహన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, మోహన్, బొర్రభాస్కర్, రామచంద్ర, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ముసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత

### -బారికెడ్లను ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు
### -ముసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి పొంగి ప్రవహిస్తున్న వరద నీరు



ముసారాంబాగ్ బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న మూసి వరద నీటి దృశ్యం

**మలక్ పేట ,ఆగస్టు 29, ప్రభాతవార్త:** భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మూసీ నది పొంగి ప్రవహిస్తుండడంతో పాటు ముసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి మూసి వరద నీరు పొంగి ప్రవహించడం తోరాకపోకలు నిలిపివేశారు. ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా మూసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి మూసి వరద నీరు పొంగి ప్రవహిస్తుండడంతో శుక్రవారం ఉదయం బ్రిడ్జి కి ఇరువైపులా రాకపోకలు నిలిపివేసి బ్యారికేడ్లను ఏర్పాటు చేసి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బోడుప్పల్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం



బోడుప్పల్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభించిన ఈటెల రాజేందర్, అజయ్ యాదవ్

**బోడుప్పల్, ఆగస్టు 29 ప్రభాతవార్త ;** బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మహితా ఎన్‌జీవో ఆధ్వర్యంలో 10 ఓపెన్ జిమ్ లు మంజూరు చేసనారు. వీటిలో 5 జిమ్ లు లక్ష్మి నగర్ పార్క్ లో, ఈస్ట్ బాలాజి హిల్స్ లో, చిన్న క్రాంతి నగర్, శివ దుర్గా నగర్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ లను ఈ రోజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, తోటకూర అజయ్ యాదవ్ ప్రారంభించారు . కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ , కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ ,మాజీ కార్పొరేటర్లు భూక్యా సుమన్ , బొమ్మకు కళ్యాణ్ నాయకులు గోనె శ్రీనివాస్, ఎరుపుల మహేష్, రాసాల నర్సింగ్ రావు యాదవ్ , మోదుగు శేఖర్ రెడ్డి, ఫకీర్ హరినాద్ రెడ్డి ,తుప్పత్ ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో మరిన్ని పార్కులు, జిమ్‌లు, ఆరోగ్య వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మేయర్ మాట్లాడుతూ... యువత, మహిళలు, వృద్ధులు అందరూ వినియోగించుకునే విధంగా ఈ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు కావడం అభినందనీయమని అన్నారు.

### క్రాంతి కాలనీలో గణేష్ వద్ద పూజలు



చెంగిచెర్ల క్రాంతి కాలనీలో గణేష్ అన్నదానకార్యక్రమంలో పాల్గొన్న బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్

**బోడుప్పల్ ,ఆగస్ట్ 29 ప్రభాతవార్త ;** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్లక్రాంతి కాలనీ రోడ్ నం1 లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు, కుంకుమర్చనలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు . మధ్యాహ్నం 1 గంటలకు ఘనంగా అన్నదాన కార్యక్రమం జరిగింది. క్రాంతినగర్ అరవింద్ కాలనీ రెడ్డి సంఘం అధ్యక్షులు జాలపు జోగి రెడ్డి, సువర్ణ దంపతులు కలిసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మాజీ డ్యూటీ మేయర్ కొత్త స్రవంతి గౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుర్రి శివ శంకర్ హాజరయ్యారు. ముఖ్య అతిథులను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. క్రాంతి కాలనీ వాసులు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

### వైదేహినగర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు



వైదేహినగర్‌లో గణపతికి పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. ఆగస్టు.29.ప్రభాతవార్త.**

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ లో నెలకొల్పిన మహా గణనాధుని విగ్రహమును బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆ గణనాథుని దివ్య ఆశీస్సులు పొందారు. అనంతరం వినాయక మండపం వద్ద నిర్వహించిన నృత్య ప్రదర్శన కార్యక్రమం తిలకించి విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, హరి హర పురం కాలనీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, సంస్కృతిక కార్యదర్శి ఎం సురేష్, అదనపు కార్యదర్శి కే రవీంద్ర, శివరాం ప్రసాద్, జంగారెడ్డి గారు తిరుపతయ్య, మీనేష్ ,రామ్మోహన్ చౌదరి, జోగి రెడ్డి మరియు తదితరులు ఉన్నారు.

### బాలాపూర్ వినాయకునికి డిసిపి సునీతారెడ్డి పూజలు



బాలాపూర్ గణేషుని దర్శించుకున్న మహేశ్వరం డిసిపి సునీతారెడ్డికి లడ్డూ ప్రసాదాన్ని అందజేసిన కళ్లెం నిరంజన్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మహేశ్వరం డిసిపి సునీతారెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం బాలాపూర్ గణేషుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికించిన అనంతరం ప్రత్యేక పూజలు చేయించారు. ఆ తర్వాత ఆమెను సన్మానించి గణేషుని మినీ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.